సాక్షి అనంతపురం

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.10 పలికింది. కనిష్టం రూ.3, సరాసరి రూ.5 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.9°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వర్షం



అనంతపురం అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణి కారణంగా జిల్లాలో తేలిక పాటి వర్షం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 18 మండలాల పరిధిలో 2.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. గుంతకల్లు, గుత్తి, ఆత్మకూరు, యల్లనూరు, యాడికి, పామిడి, నార్పల, రాప్తాడు, పెద్దవడుగూరు తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణం 110.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 52.6 మి.మీ నమోదైంది. రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

పారామెడికల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం క్రైం: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఖాళీగా ఉన్న 52 పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించినట్లు డీసీహెచ్‌ఎస్ వీ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు గ్రేడ్–2 ఫార్మసీ, ఏడు థియేటర్ అసిస్టెంట్, రెండు ల్యాబ్ అటెండెంట్, మూడు పోస్టుమార్టమ్ అసిస్టెంట్, రెండు మెడికల్ రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, ఐదు ప్లంబర్, రేడియోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్, డెంటల్ టెక్నీషియన్, 26 ఎంఎన్‌ఓ/ఎఫ్‌ఎన్‌ఓ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులను డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. httpr://ananthapuramu.ap.gov.in సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

బిందు సేద్యం లాభదాయకం



నార్పలలో సబ్సిడీ డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఓఎస్డీ వైవీఎస్ ప్రసాద్

బుక్కరాయసముద్రం/ నార్పల: బిందు (డ్రిప్) సేద్యం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఏపీఎంఐపీ అమరావతి ఓఎస్డీ వైవీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో డ్రిప్ పరికరాల వినియోగాన్ని ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓఎస్డీ వైవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తోందన్నారు. డ్రిప్ ద్వారా తక్కువ నీటితో పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఏపీఓ ఫజులున్నీసా బేగం, ఎంఐ ఏఓలు హరిత, విజయభాస్కర్, డీసీఓ రాముడు, ఎఫ్‌సీఓ ఓబిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా జిల్లాకు ఎరువుల సరఫరా కొనసాగుతున్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. బుధవారం ఆయన ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా జిల్లాకు చేరిన ఎరువులను పరిశీలించారు.

అగ్రస్థానంలో అనంత

- సచివాలయ భవన నిర్మాణాల్లో దూకుడు
- 258 నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి
- రాష్ట్రంలోనే అనంతపురం జిల్లాకు తొలిస్థానం
- నాలుగో స్థానంలో నిలిచిన శ్రీసత్యసాయి జిల్లా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యానికి వేదిక అయిన సచివాలయాల నిర్మాణంలో అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో వేగంగా నిర్మాణాలు జరుపుకున్న వాటిలో ఎనిమిది జిల్లాలు ఉన్నాయి. అందులో అనంతపురం జిల్లా ముందు వరుసలో నిలిచింది. ఇప్పటికే 258 గ్రామ సచివాలయ నిర్మాణాలను పూర్తిచేసి ఆ భవనాలను అందుబాటులోకి తెచ్చింది. నిర్మాణాలు పూర్తి చేయడం, అమల్లోకి తెచ్చిన జిల్లాలో అనంతపురం మెరుగైన ప్రగతి సాధించింది. శ్రీసత్యసాయి జిల్లా కూడా 140 గ్రామ సచివాలయాలను పూర్తి చేసి నాలుగో స్థానంలో నిలిచింది.



పూర్తయిన వాటికి రూ.103 కోట్లు

అనంతపురం జిల్లాలో ఇప్పటివరకు నిర్మాణాలు పూర్తి చేసుకుని కార్యకలాపాలు సాగుతున్న 258 గ్రామ సచివాలయాలకు రూ.103.20 కోట్ల వ్యయం చేశారు. ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు వెచ్చించారు. అంతే స్థాయిలో శ్రీసత్యసాయి జిల్లాలో 140 గ్రామ సచివాలయాలు పూర్తి కాగా.. ఇప్పటి వరకు రూ.56 కోట్లు వ్యయం చేశారు. గ్రామ సచివాలయాలు వచ్చిన తర్వాత బియ్యం కార్డులు, పింఛన్లు, అడంగల్ ఇలా అనేక రకాల సేవలు స్థానికంగానే పొందుతున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలూ ఇక్కడే లభిస్తున్నాయి. గ్రామ సచివాలయాల రాకతో తహసీల్దార్ కార్యాలయాలకు పనుల కోసం కాళ్లరిగేలా తిరిగే ప్రయాస తగ్గింది.

రాష్ట్రంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణాల్లో దూకుడు ప్రదర్శించిన టాప్ 8 జిల్లాలు

జిల్లా	మొత్తం సచివాలయాలు	పూర్తయ్యి వాడుకలోకి వచ్చినవి
అనంతపురం	432	258
నంద్యాల	366	203
కర్నూలు	382	143
శ్రీసత్యసాయి	362	140
బాపట్ల	287	98
గుంటూరు	174	88
ఏఎస్‌ఆర్	329	82
విశాఖ	53	43

త్వరలో మిగతా భవనాలు పూర్తి చేస్తాం



సచివాలయ భవన నిర్మాణాల్లో ఇప్పటివరకు 60 శాతం పూర్తయ్యాయి. మిగతా భవనాలు త్వరలోనే పూర్తి చేస్తాం. పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. గ్రామ సచివాలయాల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ అందేలా ఏర్పాట్లు చేశాం.

– గౌతమి, కలెక్టర్, అనంతపురం



శరవేగంగా సచివాలయ పనులు



మా సచివాలయ భవన నిర్మాణం వేగంగా సాగుతోంది. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో సచివాలయం కొనసాగుతోంది. వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు, వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత తదితర సంక్షేమ పథకాల కోసం ప్రజలు సచివాలయానికి వస్తున్నారు. అర్హులైన వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో దరఖాస్తును అప్‌లోడ్ చేస్తున్నాం. నూతన భవనం అందుబాటులోకి వస్తే సౌకర్యాలు పెరిగి మరింత మెరుగైన సేవలందిస్తాం.

– అబ్దుల్ కరీం, వెల్ఫేర్ అసిస్టెంట్, కణేకల్లు సచివాలయం

ఎంసీఏకు యమ క్రేజీ

- గతేడాది 2,790 సీట్లకు మాత్రమే అనుమతి
- 2023-24 విద్యా సంవత్సరంలో 5,640 సీట్ల భర్తీకి పచ్చజెండా
- కంప్యూటర్ సైన్సెస్ కోర్సులకు డిమాండ్ పెరగడమే ఇందుకు కారణం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లో మొత్తం 68 కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహించడానికి ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. 2023–24 విద్యా సంవత్సరానికి 43 ఇంజినీరింగ్ కళాశాలల్లో, 2 ఇంటిగ్రేటెడ్ కళాశాలలు, 23 స్టాండలోన్ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎంబీఏ మొత్తం 9,912 సీట్లు, ఎంసీఏ 5,640 సీట్లు భర్తీ చేసుకోవడానికి అనుమతి లభించింది. గతేడాది ఎంసీఏ సీట్లు 2,790 మాత్రమే కేటాయించగా, తాజాగా 5,640 సీట్లు కావాలని కోరారు. ఈ మేరకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకోగా, ఇందుకు జేఎన్‌టీయూ అనంతపురం ఆమోదం తెలిపింది. ఎంబీఏ గతేడాది 8,757 సీట్లు ఉండగా, తాజాగా 9,192 సీట్లకు పెంపుదల చేశారు. ఎంబీఏ నామమాత్రంగా పెరగగా, ఎంసీఏ కోర్సులో సీట్లు భారీగా పెరగడం విశేషం. నంద్యాలలో ఒక ఎంబీఏ కళాశాలకు ఈ ఏడాది అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ కళాశాల అడ్మిషన్లు రద్దు చేశారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఎంసీఏ కోర్సుకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఐసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఖరారు

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తరువాత అత్యంత ప్రాధాన్యం ఉన్న ఐసెట్ -2023 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఏపీ ఐసెట్‌ను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పకడ్బందీగా నిర్వహించి ఫలితాలను విడుదల చేసింది. గురువారం కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ నెల 8 నుంచి 14 వరకు వెబ్ కౌన్సెలింగ్ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. 9 నుంచి 16వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 12న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన, 19 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 22న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తారు.

లో ఓల్టేజీకి చెక్

- 37 అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్లు
- శరవేగంగా నిర్మాణ పనులు
- రెండు నెలల్లో వినియోగంలోకి సబ్‌స్టేషన్లు
- ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు ఊరట

అనంతపురం టౌన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఆ శాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 261 సబ్ స్టేషన్లు ఉన్నాయి. కొన్ని సబ్ స్టేషన్లకు సుదూర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు లో ఓల్టేజీ సమస్య ఎదురవుతోంది. ఆ సమస్యను పరిష్కరించేందుకు అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించారు. జిల్లాలో ఉన్న ఆరు విద్యుత్ డివిజన్లకు ప్రతి డివిజన్‌కు 6కు పైగా కొత్త సబ్ స్టేషన్లు మంజూరు చేసింది. మొత్తంగా 37 నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం రూ.81.4 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అక్టోబర్ నెలాఖరులోపు 100 శాతం నిర్మాణ పనులు పూర్తి చేసి కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదనపు సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నారు. మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి లో ఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తాం. ఇప్పటికే విద్యుత్ తీగలు, శిథిలావస్థలో ఉన్న స్తంభాల పునరుద్ధరణ పనులు సాగుతున్నాయి. అన్ని పనులూ పూర్తి అయితే రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యలకు తావుండదు.

– సురేంద్ర, ఎస్‌ఈ, విద్యుత్ శాఖ



- బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. మరో 10 రోజుల్లో నిర్మాణ పనులు 100శాతం పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ విద్యుత్ సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని గృహ వినియోగదారులతోపాటు వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.



- అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ జగనన్న కాలనీలో సబ్‌స్టేషన్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. సబ్‌స్టేషన్ వినియోగంలోకి వస్తే రూరల్ మండలం కొడిమి, రాచానపల్లి, సిండికేట్‌నగర్, నరసనాయనికుంట, ఎ.నారాయణపురం, కూడేరు మండలం గొటుకూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం, లెప్రసీ కాలనీ తదితర గ్రామాల గృహ విద్యుత్ వినియోగదారులతోపాటు వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందుతుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కనెక్షన్లు

డివిజన్	గృహ కనెక్షన్లు	కమర్షియల్ కనెక్షన్లు	వ్యవసాయ కనెక్షన్లు
అనంతపురం	2,13,994	30,452	33,600
అనంతపురం రూరల్	1,32,171	13,425	58,906
గుత్తి	1,97,843	22,616	48,594
హిందూపురం	1,98,574	19,662	42,282
కదిరి	1,88,740	17,119	51,246
కళ్యాణదుర్గం	1,62,430	13,698	75,543
మొత్తం	10,93,752	1,16,982	3,10,171

చంద్రబాబు, లోకేశ్ శాడిస్టులు

- అధికారం కోసం ఎంతకైనా దిగజారే నైజం వారిది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా ధ్వజం



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: టీడీపీ అధినేత నారా చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ప్రజల పాలిట శాడిస్టులుగా మారారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని రావణ కాష్టం చేయడానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడుతూ అల్లర్లను ప్రోత్సహిస్తున్నారన్నారు. అధికారంలోకి రావడం కోసం ఎంత నీచానికైనా ఒడిగట్టే నైజం తండ్రీ కొడుకులదని మండిపడ్డారు. బుధవారం ఆయన తాడిపత్రిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తారని జాతీయ మీడియా పేర్కొంటున్న నేపథ్యంలో నారాసురులు (బాబు–లోకేశ్) అరాచకాలకు తెగబడుతున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పాలన సాగిస్తుండడం ఓర్వలేక పచ్చ మీడియా సహకారంతో విషపురాతలు రాయిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అమరావతి భూముల కుంభకోణం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పోలవరం, నీరు – చెట్టు తదితర పనుల్లో అంతులేని అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాజధాని నిర్మాణంలో బోగస్ కంపెనీల ద్వారా రూ.వందల కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేశారన్నారు. నాటి అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు ఇస్తే.. దాదాపు రూ.200 కోట్లు చేతులు మారాయన్నారు. దీంతో తేలు కుట్టిన దొంగలా చంద్రబాబు ఉన్నారని, ఆయన పల్లకీ మోసే పవన్ కళ్యాణ్ మిన్నకుండిపోయారన్నారు. ప్రశ్నించాల్సిన వామపక్ష పార్టీలు కూడా చంద్రబాబు అక్రమాలపై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు 'మీ భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ ప్రజల చెవుల్లో పూలు పెట్టేందుకు మరోసారి సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. తాయెత్తులు ఇంట్లో దేవుడి వద్ద ఉంచండి, వాటిని కట్టుకోండి అంటూ పిచ్చిప్రేలాపనలు చేస్తున్న చంద్రబాబును చూస్తుంటే ఆయనకు మతి భ్రమించిందని అర్థమవుతోందన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) కాలువ పనులను శిలాఫలకాలకే పరిమితం చేసిన ఘనత చంద్రబాబుదైతే.. నిర్వాసిత రైతులకు నష్టపరిహారం అందించి, వారి అంగీకారంతో పనులు ముందుకు తీసుకెళ్తున్న ఘనత సీఎం జగన్‌దని పైలా స్పష్టం చేశారు. సీఎంపై విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు.

17న డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు ఈ నెల 17న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. నగరంలోని కేఎస్ఎన్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఐదు, ఆరో సెమిస్టర్‌లో ఏదైనా ఒక్క సబ్జెక్టు ఫెయిలైన వారు మాత్రమే ఇన్‌స్టంట్ పరీక్ష రాయడానికి అర్హులని తెలిపారు. ఈ నెల 11లోపు పరీక్ష ఫీజు కట్టడానికి చివరి తేదీ అని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

ప్రతిపక్ష నేతకు ఓటమి భయం

- సీఎంపై నోరుపారేసుకుంటే ఖబడ్దార్
- అభివృద్ధిపై చర్చకు టీడీపీ నేతలు సిద్ధమా?
- మంత్రి ఉషశ్రీచరణ్ సవాల్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం: ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ నాయకులు సీఎం జగన్‌ను విమర్శించడం, మంత్రులను, ఎమ్మెల్యేలను దూషించడం పరిపాటిగా మారిందన్నారు. సీఎంపై అనవసరంగా నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని.. ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. బుధవారం కళ్యాణదుర్గంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. టీడీపీ హయాంలో చంద్రబాబు బీటీపీ కాలువను ఆర్భాటంగా తవ్వి శిలాఫలకాలకే పరిమితం చేశారని విమర్శించారు. బలవంతంగా భూములు లాక్కుని ఏ ఒక్కరికీ పరిహారం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఓటుబ్యాంకుతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. బీటీపీ కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో పరిహారం ఇస్తున్నామని చెప్పారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై టీడీపీ నాయకులకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఏ సచివాలయం పరిధిలోనైనా... ఏ మారుమూల గ్రామంలోనైనా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే ఒక్కరూపాయి అధికంగా టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాల ద్వారా ఇచ్చి ఉంటే చూపించాలన్నారు.

చిన్ని కృష్ణుల సందడి



కృష్ణుని వేషధారణలో చిన్నారులు

- ఇస్కాన్‌లో అంబరమంటిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలువురు తల్లులు తమ పిల్లలకు చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలంకరించి తీసుకొచ్చారు. ఆలయ పరిసరాలు తిరుగుతూ సందడి చేశారు. మందిర నిర్వాహకుడు దామోదర గౌరంగ దాసు నేతృత్వంలో విశ్వశాంతి హోమం నిర్వహించారు. భక్తుల విష్ణుసహస్రనామ పారాయణంతో, హరినామ సంకీర్తనతో మందిరం ప్రతిధ్వనించింది. రాధాపార్థసారథులను ప్రత్యేక సుగంధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం వాహన, ఊంజల సేవలు, మహామంగళ హారతి, తీర్థప్రసాద వితరణ జరిగింది. రాత్రి పొద్దుపోయే వరకు కూడా హరేకృష్ణ నామస్మరణతో పరిసరాలను భక్తులు మార్మోగించారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన పలు పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, తెప్పోత్సవం, ఉట్టి ఉత్సవం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



రాధాపార్థసారథులకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



ఇస్కాన్ మందిరంలో దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఇస్కాన్ మందిరం వద్ద భక్తుల సందడి

క్లుప్తంగా

ఘనంగా సుదర్శన హోమం



నేమకల్లు ఆంజనేయ స్వామిని వెన్నతో అలంకరించిన దృశ్యం

బొమ్మనహాళ్: శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవి రాట్‌ను వెన్నతో అలంకరించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వెండి కవచధారణ, బంగారు కిరీటధారణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల మిస్సింగ్ కేసు ఛేదింపు



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ నాగార్జున రెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని వడియంపేట వద్ద ఉన్న కేశవరెడ్డి పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు మిస్సింగ్ అయిన కేసును 24 గంటల్లోపే పోలీసులు ఛేదించారు. 9వ తరగతి విద్యార్థులు మనోజ్ కుమార్, కార్తీక్, మహేష్, చంద్రమౌళి పాఠశాల యాజమాన్యానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మంగళవారం బయటకు వెళ్లిపోయిన విషయం తెలిసిందే. వీరిలో చంద్రమౌళి అదే రోజు సాయంత్రం 7 గంటలకు తాడిపత్రిలోని తన ఇంటికి చేరుకోగా, మిగిలిన ముగ్గురు విద్యార్థులు ఆచూకీ కోసం పాఠశాల యాజమాన్యం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అనంతతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పర్యవేక్షణలో మూడు బృందాలుగా పోలీసులు విడిపోయి గాలింపు చర్యలు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కర్నూలు రైల్వే స్టేషన్‌లో మనోజ్‌కుమార్, కార్తీక్, మహేష్‌ను గుర్తించి, సీఐ నాగార్జునరెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ బృందం అక్కడకెళ్లి వారిని బీకేఎస్ పోలీస్ స్టేషన్‌కు పిలుచుకొచ్చారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు.

ఏం'జేసి'నా.. కష్టమే!

- ప్రశ్నార్థకంగా జేసీ సోదరుల రాజకీయ భవిష్యత్తు
- టీడీపీ సర్వేలోనూ వెనుకంజ?
- 'ప్రత్యామ్నాయం'పై అధిష్టానం దృష్టి
- అనుచరుల్లో నిరాశా నిస్పృహలు
- 'బ్రదర్స్' అహంకారంతో వారసులకూ నష్టం



తాడిపత్రి: ఒకప్పుడు ఇంట్లో కూర్చొనే కనుసైగలతో జిల్లా రాజకీయాలను శాసించిన జేసీ సోదరుల రాజకీయ భవిష్యత్తు నేడు ప్రశ్నార్థకంగా మారింది. అహంకారం, నోటి దురుసు వారిని ఈ స్థాయికి తెచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారి తీరుతో వారసుల రాజకీయ భవిష్యత్తూ ప్రమాదంలో పడింది. జేసీ సోదరులు సుమారు 35 ఏళ్ల పాటు తాడిపత్రి నియోజకవర్గాన్ని కబంధ హస్తాల్లో ఉంచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వారి వైఖరితో విసిగి వేజారిన ప్రజలు 2019 ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పారు. వైఎస్సార్‌సీపీని ఆదరించి కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి. ఫలితంగా వైఎస్సార్‌సీపీకి మరింత ఆదరణ పెరిగింది. ఇటీవల కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రకు విశేష జనాదరణ లభించడమే ఇందుకు నిదర్శనం. ఈ పరిణామాలు జేసీ బ్రదర్స్‌ను, వారి అనుచరులను అంతర్మథనంలో, ఆందోళనలో పడేశాయి.

సర్వేలోనూ వెనుకంజ?

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో రాష్ట్రంలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లపై ఆ పార్టీ అధిష్టానం ఇటీవల సర్వే చేయించినట్లు తెలుస్తోంది. అందులోనూ జేసీ సోదరులు వెనుకంజలో ఉన్నట్లు సమాచారం. మునిసిపల్ చైర్మన్‌గా పట్టం కట్టినా జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, అధికారులను టార్గెట్ చేస్తూ, నోటిదురుసుగా మాట్లాడుతూ పాలన కుంటుపడేలా చేశారన్న అంశం సర్వేలో వెల్లడైనట్లు తెలిసింది. జేసీ ప్రభాకర్‌రెడ్డి వల్ల టీడీపీకి నష్టమే కానీ, చేకూరే లాభం ఏమీలేదన్న విషయం వెల్లడి కావడంతో ఆ పార్టీ అధిష్టానం ప్రత్యామ్నాయ నాయకత్వంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా గతంలో జేసీ సోదరులపై వరుసగా పోటీ చేసి ఓటమి పాలైన నాయకుడి వైపు చూస్తున్నట్లు సమాచారం. అతనికి టికెట్ కేటాయిస్తే కనీసం డిపాజిట్ అయినా దక్కుతుందని, లేదంటే అదీ గల్లంతేనన్న భావన టీడీపీ వర్గాల్లోనే వ్యక్తమవుతోంది.

దూరమవుతున్న కేడర్

జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహారశైలిపై సొంత పార్టీ కేడర్‌లోనే అసంతృప్తి ఉంది. తన ఉనికి కోసం మాత్రమే పాకులాడే ఆయన్ను నమ్ముకుంటే తమకు నష్టమేనని కొందరు కౌన్సిలర్లు భావిస్తున్నారు. టీడీపీ సొంత సామాజిక వర్గం కూడా జేసీ వ్యవహారశైలిని తప్పుబడుతోంది. చివరకు అనుచరుల్లోనూ తీవ్ర నిరాశా నిస్పృహలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే జేసీ అనుచరుడు, పెద్దపప్పూరు మండల నాయకుడు రఘునాథ్‌రెడ్డి ఇటీవల వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. అలాగే కౌన్సిలర్ రాబర్ట్, అయూబ్ బాషా పార్టీకి రాజీనామా చేశారు. మరికొందరు ఇదేబాటలో పయనించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఉలిక్కిపడిన జేసీ సోదరులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తమ నివాసంలో విందు ఏర్పాటు చేసి బుజ్జగించినట్లు తెలిసింది. అయినప్పటికీ కేడర్ వారిని విశ్వసించడం లేదు.

వారసులకూ నష్టం

జేసీ కుటుంబాన్ని నియోజకవర్గ ప్రజలు సుదీర్ఘ కాలం పాటు ఆదరించినప్పటికీ వారి ఇబ్బందులను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. సరికదా ఏవైనా సమస్యలు చెప్పుకునేందుకు తమ వద్దకు వచ్చిన ప్రజలను నోటికి ఎంతొస్తే అంత మాట అనే వారు. చులకనగా, హేళనగా మాట్లాడేవారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే నియోజకవర్గంలో పర్యటించి హడావుడి చేసేవారు. ఎన్నికల అనంతరం వ్యాపారాలకు పరిమితమయ్యేవారు. జేసీ బ్రదర్స్ అహంకారపూరితంగా, పెత్తందారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలను నిర్లక్ష్యం చేసిన ఫలితంగా 2019 ఎన్నికల్లో వారి వారసులుగా బరిలోకి దిగిన జేసీ పవన్, జేసీ అస్మిత్‌రెడ్డిలను ఓడించి గట్టిగానే గుణపాఠం నేర్పారు. ఇప్పుడు కూడా వారసుల రాజకీయ ఎదుగుదలకు జేసీ సోదరులే ప్రతిబంధకంగా మారారన్న భావన తాడిపత్రి ప్రజల్లో వ్యక్తమవుతోంది.

10న నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ఈ నెల 10న నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం అనంతపురంలోని జయమణెమ్మ కల్యాణమంటపంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ మహిళా ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఉమామహేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరించారు ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 10న ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, సలహాదారు శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, కోశాధికారి నాగరాజు, దివాకర్, వివేకానంద స్వామి, నరసింహులు, రమేష్, వెంకటేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

తొలగింపు ఓట్లపై పునఃపరిశీలన పూర్తి



విడపనకల్లులో తొలగింపు ఓట్లను పునఃపరిశీలన చేస్తున్న కలెక్టర్ గౌతమి (ఫైల్)

అనంతపురం అర్బన్: తొలగింపు ఓట్లకు సంబంధించి పునఃపరిశీలన ప్రక్రియ జిల్లాలో పూర్తయ్యింది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం గురువారం నాటికి పూర్తి చేయాల్సి ఉండగా ఒక రోజు ముందే బుధవారం నాటికి పూర్తి చేశారు. ఓట్లను తొలగించారంటూ ఎన్నికల కమిషన్‌కు రాజకీయ పార్టీలు ఫిర్యాదు చేశాయి. స్పందించిన ఎన్నికల కమిషన్ 2022 జనవరి 6 నుంచి ఈ ఏడాది ఆగస్టు 9 వరకు తొలగించిన ఓట్లను పునఃపరిశీలించాలని ఆదేశించింది. జిల్లాలో 96,153 ఓట్లను తొలగించినట్లు అధికారులు గుర్తించారు. ప్రత్యేక ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ గత నెల 24న పూర్తయ్యింది. ఆ వెంటనే తొలగింపు ఓట్ల పునఃపరిశీలన ప్రక్రియను జిల్లా యంత్రాంగం చేపట్టింది. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ) ప్రతి తొలగింపునూ పరిశీలించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తొలగింపులను ర్యాండమ్ చెకప్ చేయాలని సూచించింది. ఏఈఆర్‌ఓ 1,000 తొలగింపులను, ప్రత్యేక అధికారి 500 తొలగింపులను, కలెక్టర్ ప్రతి నియోజకవర్గం పరిధిలో 100 తొలగింపులను పునఃపరిశీలించాలని కమిషన్ ఆదేశించింది. ఈ ప్రకారం జిల్లాలోని ఎనిమిది నియోజవకర్గాల పరిధిలో తొలగింపునకు గురైన 96,153 ఓట్ల పునఃపరిశీలన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. పునఃపరిశీలన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన సిబ్బంది, అధికారులకు కలెక్టర్ గౌతమి అభినందనలు తెలిపారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

- 50 పడకల నూతన ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవంలో మంత్రి ఉషశ్రీచరణ్



నూతన భవనాన్ని ప్రారంభించి ఎమ్మెల్సీ మంగమ్మతో సెల్ఫీ దిగుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. 30 పడకల సామర్థ్యమున్న కళ్యాణదుర్గం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని 50 పడకలకు పెంచుతూ రూ.3 కోట్ల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన గదులను ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి బుధవారం ఆమె ప్రారంభించారు. ఫార్మసీ, గైనిక్, జనరల్ ఓపీ, చిన్న పిల్లల వార్డు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది మంత్రి మాట్లాడుతూ.. రోగుల పట్ల స్నేహభావంతో మెలగాలన్నారు. ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న తరుణంలో ఏ ఒక్కరూ ప్రభుత్వాస్పత్రిలో వైద్యం సరిగా అందలేదంటూ నిరాశతో వెనుతిరగకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆస్పత్రిలో అన్ని వసతులూ ప్రభుత్వం కల్పించిందన్నారు. అంతకు ముందు మంత్రికి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, సీహెచ్‌సీ వైద్యాధికారులు మాధవి, ప్రసన్న, జమీలా, రూప, హేమలత, దామోదర్, చరణ్, పవన్, శివ, శ్వేత, హర్షద్ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ కాంతమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, నాయకులు సుధీర్, నరేంద్రరెడ్డి, తిరుమల వెంకటేశులు, బ్రహ్మయ్య, బిక్కి నాగలక్ష్మి, కౌన్సిలర్లు అర్చన, లక్ష్మన్న, అప్జల్, షెక్షావలి, భట్టువానిపల్లి అంజి, ఎంపీటీసీ లింగమ్మ, హనుమంతరాయుడు, బిక్కిహరి, హేమ, హబీబ్, గోళ్ల మోహన్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, పెరుగుపాళ్యం తిమ్మరాజు, హరినాథ్ రెడ్డి, పోస్టు క్రిష్ణ పాల్గొన్నారు.

బైక్ రిపేరీపై ఉచిత శిక్షణ

అనంతపురం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల మరమ్మతుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి బుధవారం ఓ ప్రకటన జారీ చేశారు. 45 రోజుల పాటు సాగే శిక్షణా కార్యక్రమంలో స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్లతో వ్యవహరించే తీరు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తారు. పదో తరగతి పాస్/ఫెయిల్, ఐటీఐ పాస్/ఫెయిల్ అయి, 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులు. శిక్షణా కాలంలో మధ్యాహ్నం భోజనం అందజేస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా టూల్‌కిట్, సర్టిఫికెట్ మంజూరు చేయడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ కల్పిస్తారు. పూర్తి వివరాలకు 93905 05952, 77807 52418లో సంప్రదించవచ్చు.

జాతీయ స్థాయి లేఖ రచనా పోటీలు

అనంతపురం సిటీ: తపాలా శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి లేఖ రచనా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ అనంతపురం పీఆర్‌ఓ ప్రమోద్ బుధవారం తెలిపారు. భారత తపాలా శాఖ చేపట్టిన 'ఢాయి అఖర్' కార్యక్రమంలో భాగంగా 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై లేఖ రచనా పోటీలు ఉంటాయి. ఇన్‌ల్యాండ్ లెటర్/పోస్ట్‌కార్డు/ఏ4 పేజీల్లో వ్యాసం రాయాల్సి ఉంటుంది. అన్ని వయస్సుల వారిని నాలుగు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించనున్నారు. పరీక్షలో పాల్గొనేందుకు ముందుకు వచ్చే విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పోస్టాఫీసులు పరిధిలోని సిబ్బంది ద్వారా పోటీలు ఏర్పాటు చేస్తారు. అక్టోబర్ 31లోగా తెలుగు, ఆంగ్లం, హిందీ బాషల్లో పోటీలు ఉంటాయి. రాసిన వ్యాసాలను విజయవాడ సర్కిల్ కార్యాలయానికి పంపితే, అక్కడి నుంచి న్యూఢిల్లీకి పంపుతారు. పోటీల్లో గెలుపొందిన వారికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.25 వేలు, ద్వితీయ బహుమతి కింద జాతీయ స్థాయిలో రూ.25 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.10 వేలు, తృతీయ బహుమతి కింద జాతీయ స్థాయిలో రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.5 వేలు నగదు పురస్కారాలు ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనవచ్చు.

ఎన్‌సీసీ శిక్షణ భవితకు భరోసా

- తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ జనరల్ డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి



క్యాడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న వీఎం రెడ్డి

కూడేరు: ఎన్‌సీసీలో శిక్షణ పొందితే ఉజ్వల భవిత ఉంటుందని తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ జనరల్ డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డి అన్నారు. కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎన్.రమేష్, ప్రణాళిక–సహకార అసిస్టెంట్ డైరెక్టర్ కల్నల్ సంజయ్ గుప్తాతో కలసి బుధవారం ఆయన కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌ను సందర్శించారు. సీఏటీసీ–6వ ఆంధ్రా బెటాలియన్ శిక్షణా తరగతులు, మౌలిక వసతులు పరిశీలించారు. మ్యాప్‌రీడింగ్, ఆప్టికల్, ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశమూ క్యాడెట్ల బంగారు భవిష్యత్‌కు దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌సీసీ కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలలో ఢిల్లీలో జరిగే తల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొనే క్యాడెట్లను ఇక్కడ శిక్షణ పొందుతున్న వారి నుంచే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా, ఎన్‌సీసీ అధికారులు, శ్రీసత్యాసాయి, నంద్యాల, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన క్యాడెట్లు పాల్గొన్నారు.

దుర్గంలో చంద్రబాబు 'షో' అట్టర్ ఫ్లాప్


కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో బుధవారం రాత్రి చంద్రబాబు నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. 'బాబు ష్యూరిటీ – భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో చంద్రబాబు చేపట్టిన కార్యక్రమానికి జనం కరువయ్యారు. అనుకున్న స్థాయిలో పార్టీ శ్రేణులు సైతం సభకు హాజరుకాకపోవడంతో సభాప్రాంగణం జనం లేక బోసిపోయింది. టీడీపీ ఇన్‌ఛార్జ్ ఉమామహేశ్వర నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి మధ్య వర్గ విభేదాలే ఇందుకు కారణంగా ఆ పార్టీ నాయకులే బాహాటంగా పేర్కొనడం గమనార్హం. చంద్రబాబు ఆద్యంతం సీఎం వైఎస్ జగన్, మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌పై ఆరోపణలు గుప్పిస్తుండడంతో దాదాపు ప్రజలందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో సభా వేదిక చుట్టూ మినహా మిగిలిన స్థలం, రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఉమామహేశ్వరనాయుడు సైతం ముందస్తుగా తాను ఏర్పాటు చేసుకున్న వారితోనే మాట్లాడించి అధినేత మెప్పు పొందేందుకు తాపత్రయపడ్డారు. అనంతరం ఓపెన్ టాప్ వాహనంపై చంద్రబాబు నిర్వహించిన రోడ్ షో కూడా వెలవెలబోయింది. తాను బస చేసిన శ్రీనివాస కల్యాణమంటపం వద్ద కళ్లు లేని చిన్నారితో కలిసేందుకు ప్రయత్నించిన దంపతులను వారిస్తూనే చంద్రబాబు లోపలకు వెళ్లిపోయారు. 'సార్... కళ్లు లేవు... కాళ్లు కూడా సరిగా లేవు సర్....సర్..' అంటుండగా 'ఉండయ్యా...ఉండు' అంటూ చంద్రబాబు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలువ శ్రీనివాసులు అసహనం వ్యక్తం చేశారు. సాయం మాటేమో కానీ సమస్య తెలిపేందుకు వస్తే కనీసం పలకరించేందుకూ మనసొప్పని చంద్రబాబు వైఖరిపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

బాబు రోడ్ షో ఫ్లాప్

కణేకల్లు: ప్రతిపక్ష టీడీపీ నేత చంద్రబాబు రోడ్ షో కణేకల్లులో ఫ్లాప్ అయ్యింది. బస్టాండ్ ప్రాంతంలో ఆశించిన మేర జనం లేకపోవడంతో బాబు రెండు నిమిషాలకు మించి ఎక్కువ సేపు ఉండలేకపోయారు. ఆ రెండు నిమిషాలు కూడా స్థానిక టీడీపీ నాయకులు గజమాల వేసేందుకే సరిపోయింది. మొన్నకు మొన్న టీడీపీ చేపట్టిన బస్సుయాత్రకు కొంతలో కొంత మేర జనం ఉండగా.... పార్టీ అధినేత, 40 ఇయర్స్ ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబు పర్యటనకు జనం లేక పోవడం టీడీపీ శ్రేణుల్లో నిరాశ కలిగించింది. పల్లెల నుంచి జనం వచ్చే సంగతి అటుంచితే... కణేకల్లులో ఉన్న జనం, పార్టీ సానుభూతి పరులు, కార్యకర్తలు సైతం ఆ వైపుగా కన్నెత్తి కూడా చూడలేదు.

నిండు గర్భిణి అని తెలిసినా 108కు దారివ్వని తమ్ముళ్లు!

- 15 నిమిషాల పాటు నరకయాతన
- మరో మార్గంలో ఆస్పత్రికి తరలింపు



108 వాహనానికి అడ్డుగా నిలిచిన దృశ్యం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం టీడీపీ శ్రేణుల్లో మానవత్వం నశించింది. పురిటి నొప్పులతో బాధపడుతున్న హైరిస్క్ గర్భిణిని తరలిస్తున్న 108 అంబులెన్స్‌కు దారివ్వకుండా 15 నిమిషాల పాటు నరక యాతన చూపించారు. వివరాలు... కుందుర్పి మండలం కరిగానిపల్లి గ్రామానికి చెందిన శాంతి గర్భం దాల్చినప్పటి నుంచి ఆమెను హైరిస్క్ గర్భిణిగా వైద్యులు గుర్తించి ప్రత్యేక చికిత్సలు అందజేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆమెకు నెలలు పూర్తిగా నిండాయి. పదో నెల గర్భంతో ఉన్న ఆమెకు బుధవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు వెంటనే కుందుర్పిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వెంటనే ఆమెను 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. సాయంత్రం 6.56 గంటలకు కళ్యాణదుర్గంలోకి ప్రవేశించిన అంబులెన్స్ పైలెట్ టీసర్కిల్ మీదుగా ఆస్పత్రికి గర్భిణిని చేర్చేందుకు ప్రయత్నించాడు. అయితే అప్పటికే టీసర్కిల్‌లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బహిరంగ సభ కోసం స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేపట్టారు. గంటకు పైగా ఈ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఆ సమయంలోనే అక్కడకు చేరుకున్న అంబులెన్స్‌కు దారివ్వకుండా బారికేడ్లను అడ్డుగా ఉంచారు. దాదాపు 15 నిమిషాల పాటు అంబులెన్స్ అక్కడే నిలిచిపోయింది. పురిటి నొప్పులు తాళలేక గర్భిణి పడుతున్న ఇబ్బందులను గమనించిన పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని మరో మార్గం ద్వారా ఆస్పత్రికి చేర్చారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి: నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని టైలర్స్ కాలనీకి చెందిన ధనలక్ష్మి, రమేష్‌బాబు దంపతుల కుమారుడు వంశీకృష్ణ (23) బీటెక్ పూర్తి చేశారు. కొంత కాలంగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తున్నారు. ఇటీవల కాస్త మతిస్థిమితం లేక మాట్లాడుతూ తీవ్ర మానసిక సంఘర్షణలో సతమతమయ్యేవాడు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చిన వంశీకృష్ణ... పుట్లూరు రోడ్డులోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బొలెరో ఢీకొని ఇద్దరి మృతి

- మృతులిద్దరూ ఆత్మకూరువాసులే



మృతులు సురేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి

ఆత్మకూరు: వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతులిద్దరూ ఆత్మకూరు వాసులే కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరుకు చెందిన ఓబుళరెడ్డి (35), సురేష్ రెడ్డి (47) బుధవారం పనిపై అనంతపురానికి వెళ్లారు. రాత్రికి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి వద్దకు చేరుకోగానే కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి టమాట తరలిస్తున్న బొలెరో పికప్ వాహనం వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. ఘటనలోద్విచక్రవాహనం నుజ్జునుజ్జైంది. తీవ్రంగా గాయపడిన ఓబుళరెడ్డి, సురేష్‌రెడ్డిని స్థానికులు వెంటనే హైవే అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతులిద్దరూ వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ఓబుళరెడ్డి అవివాహితుడు. సురేష్‌రెడ్డికి భార్య ధనలక్ష్మి, ఓ కుమార్తె ఉన్నారు. విషయం తెలియగానే ఆత్మకూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలిసిమెలిసి ఉండేవారు రోడ్డు ప్రమాదంలో మరణించారన్న విషయం తెలయగానే రెండు కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటో నుంచి జారి పడి వృద్ధురాలి మృతి

కదిరి అర్బన్: ఆటో నుంచి జారిపడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరికుంట్లపల్లి రాజారెడ్డి కాలనీకి చెందిన శివమ్మ (67) బుధవారం ఉదయం పందులకుంటలో కూలి పనులు ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమైంది. ఆటోలో తనకు చోటు లేకపోవడంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ప్రయాణిస్తున్న ఆమెసోమేష్‌నగర్ వద్దకు చేరుకోగానే కుదుపులకు అదుపుతప్పి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు కదిరిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బుగ్గరామలింగేశ్వరున్ని తాకిన సూర్య కిరణాలు



తాడిపత్రి అర్బన్: స్థానిక ప్రాచీన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. శ్రావణ మాసంలో వచ్చే కృష్ణ పక్షం అష్టమి సందర్భంగా సాయం సంధ్యవేళలో మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకాయి. విషయం తెలుసుకున్న భక్తులు సాయంత్రం 6 గంటలకు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. సూర్య కిరణాలు తాకడంతో మూలవిరాట్ బంగారు వర్ణాన్ని సంతరించుకుంది. విశేష పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

క్లుప్తంగా

అభాగ్యులకు అండగా ప్రభుత్వం



యర్రగుంటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అరుణమ్మ

రాప్తాడు: అభాగ్యులకు జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందని సర్పంచ్ అరుణమ్మ అన్నారు. బుధవారం మండలంలోని యర్రగుంట గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం వృద్ధులు, అభాగ్యులను అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు. వృద్ధాప్యంలో పింఛన్ ఇచ్చి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన అన్ని హామీలను ఇప్పటికే సీఎం జగనన్న అమలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక పరిస్థితులను మార్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాముడు, జేసీఎస్ కన్వీనర్ రాము, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న ఓబుళంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన ఓబుళంపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో అన్ని రకాల వ్యాధులకు ఉచిత చికిత్సలతో పాటు మందులు అందజేస్తామన్నారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు తమ ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకుని రావాలని సూచించారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు





వేపకుంటలో వర్షానికి కూలిన ఇంటి పైకప్పు, దెబ్బతిన్న ఇల్లు

కనగానపల్లి: గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని వేపకుంట గ్రామంలో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఎస్టీ కాలనీలో సాకే నారాయణమ్మకు చెందిన ఇంటి పైకప్పు కూలి పోయింది. దీంతో ఇంట్లోని ధాన్యంతో పాటు సామగ్రి తడిసి పోయింది. సుమారు రూ.50 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. అలాగే ఎస్సీ కాలనీలో మరో రెండు ఇళ్లు కూడా వర్షాలకు దెబ్బతిన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇళ్లను పరిశీలించి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్, చిట్రా వెంకటేష్

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్రా వెంకటేష్ బుధవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ అనాథాశ్రమంలో వృద్ధులు, అనాథ పిల్లల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నసనకోట ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలు, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్రా వెంకటరాముడు, బాబు, సూరీ, బండి రమణ, చియ్యేడు నాగేంద్ర, ఆశ్రమ నిర్వాహకులు సిస్టర్ జ్ఞానమ్మ, సిస్టర్ జేసింత, సిస్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

దురాక్రమణలను తొలగించడం హర్షణీయం



జేసీబీతో అడ్డు తొలగించి రహదారి ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

అనంతపురం కల్చరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలకు వేలాదిగా తరలి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని దురాక్రమణలను తొలగించి దర్శనం సజావుగా సాగడానికి సహకరించిన అధికారులకు ఇస్కాన్ జిల్లా చైర్మన్ దామోదర గౌరంగ దాసు కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా గుత్తిరోడ్డు సమీపంలో ఉన్న ఇస్కాన్‌కు సంబంధించిన స్థలానికి అడ్డుకట్ట వేసి భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన కబ్జాదారులను ఒప్పించి ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ శ్రీధరమూర్తి రహదారి సుగమం చేశారు. బుధవారం రాత్రి జేసీబీతో అడ్డు ఆక్రమణలను తొలగించి భక్తులు సులువుగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ అధికారులు వేగంగా స్పందించి అందించిన సహకారానికి దామోదర గౌరంగ దాసు, ఆరెస్సెస్ సభ్యుడు రఘు ధన్యవాదాలు తెలిపారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



రాధాకృష్ణుల నృత్యం..

- సాయిగోకులంలో చిన్ని కృష్ణుల సందడి
- అలరించిన ఉట్టి కార్యక్రమం

అనంతపురం కల్చరల్: చేతిలో పిల్లన గ్రోవి, మెడలో పూలదండ, తలపై నెమలి పింఛం ఒంటి నిండా ఆభరణాలతో చిన్ని కృష్ణులు సందడి చేశారు. బుధవారం రాత్రి స్థానిక లలిత కళాపరిషత్తులో కృష్ణమేళ జరిగింది. చిన్నారి కృష్ణులు, గోపికల మధురగానం, ఆటపాటలతో రేపల్లెను తలపించింది. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీనృత్య కళానిలయం, సాయిట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కృష్ణమేళాలో అనేక మంది చిన్నారులు కృష్ణులు, గోపికల వేషధారణలో అలరించారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందంలోని నాట్యకళాకారులు సాగించిన నృత్యహేళ ఆద్యంతం ఆకట్టుకుంది. ఉట్టి కొట్టేందుకు చిన్ని కృష్ణులు పోటీపడ్డారు. చిన్నారులతో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, నిర్వాహకులు విజయ్‌కుమార్, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, ఆచార్య సుధాకరబాబు హాజరయ్యారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. సంప్రదాయాన్ని చాటేలా గోకులాష్టమిని నిర్వహించిన సాయిట్రస్టు, నృత్య కళానిలయం వారిని ప్రత్యేకంగా అభినందించారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ప్రత్యేక టెంట్‌ను ఏర్పాటు చేసి అందులో శ్రీకృష్ణుణి ప్రతిమను ఏర్పాటు చేశారు. గురువారం కృష్ణుడి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రాప్తాడు: రాప్తాడులోని శ్రీకృష్ణుడి ఆలయం, పండమేటి రాయుడు, నీలకంఠేశ్వర, ఆంజనేయ, మారేమ్మ, పెద్దమ్మ, చిన్మయనగర్‌లోని వెంకటేశ్వర స్వామి, శివాలయం, హంపాపురంలోని 39 అడుగుల అభయాంజనేయ స్వామి, మారురులో చిన్న కదిరయ్య స్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రితాత స్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



కనగానపల్లి: కోనాపురంలో పూజలు



చెన్నేకొత్తపల్లి: అలంకరణలో శ్రీకృష్ణుడి విగ్రహం

ఆయా గ్రామాల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. సాయంత్రం ఎద్దుల బండిపై గ్రామోత్సవం నిర్వహించారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పలుచోట్ల పిల్లలను బాలకృష్ణులు, గోపికలుగా అలకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని యాదవులు శ్రీకృష్ణుడి విగ్రహాలను మండపాల్లో కొలువుదీర్చారు.



కృష్ణాష్టమి వేడుకలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యం చేస్తున్న మహిళలు



కృష్ణుడి బొమ్మతో ఆడుకుంటున్న ఓ చిన్నారి

వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకుందాం



పూజల్లో పాల్గొన్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కల్చరల్: మత సామరస్యం వెల్లివిరిసేలా వినాయక చవితిని జరుపుకుందామని మేయర్ వసీం సలీం అన్నారు. బుధవారం గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ సమీపంలో వినాయక మండపానికి భూమి పూజ చేశారు. సమితి కార్యదర్శి పరుచూరు రమేష్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కాషాయ ధ్వజాన్ని ఎగురేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి 22 వరకు వైభవంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తామన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరులో ప్రసిద్ధి చెందిన కమండల గణపతి దేవస్థానం ఆకృతితో కదలికల గణపతిని ప్రతిష్టిస్తామన్నారు. అదే విధంగా డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్ కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, గూడూరు మల్లికార్జున, బీజేపీ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, లలిత్‌కుమార్, సుంకు వేణుగోపాల్, హర్ష, ప్రమోద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, దాదు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు పోరాడదాం



రమేష్, జిల్లా అధ్యక్షుడు



అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణకు అందరం సమష్టిగా పోరాడదామని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఎంఈఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ చేపట్టే ఉద్యమాల్లో పాల్గొనాలన్నారు. ఈనెల 18 నుంచి 22 వరకూ జరగనున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన ఎంఈఎఫ్ కమిటీని ఎంపిక చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడిగా రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా బండారు నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్, జిల్లా అదపు ప్రధాన కార్యదర్శిగా కంబగిరి స్వామి, జిల్లా కోశాధికారిగా దేవర పుల్లన్న, జిల్లా ఉపాధ్యక్షులుగా నరసింహులు, హనుమంతరావు, శ్రీనివాసులు, గంగన్న, రామన్న, మల్లికార్జున, ఓబులేసు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నగేష్, కిష్టప్ప, నాగరాజు, తిప్పేస్వామి, భైరవ కుమార్, గంగధార్, ప్రభాకర్, సెట్టేల మల్లికార్జున, గౌరవ సలహాదారులుగా సుబ్బన్న, లక్ష్మన్న, సూర్యనారాయణ, మోహన్ బాబు, రాష్ట్ర కౌన్సిలర్లుగా రంగయ్య, రవిశంకర్, ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దోమకాటు నివారణ చర్యలు



టాయిలెట్లకు నెట్ కట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్ గురుశేఖర్ బాబు

అనంతపురం క్రైం: నగరంలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టినట్లు నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరంలోని 50వ డివిజన్‌లో వివిధ నిర్వాసితుల ఇళ్ల టాయిలెట్ పైప్‌లకు నెట్‌లను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటిని, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శులను ఆదేశించారు. కార్యమంలో కార్పొరేటర్ గురుశేఖర్ బాబు, సచివాలయ సిబ్బంది శంకర్ రెడ్డి, మాలతి, గీత, ముకేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి



టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన హరి

బత్తలపల్లి: మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు .. గ్రామంలో టీడీపీ హయాంలో కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో కొత్తగా ఎస్టిమేట్‌లు వేసి ప్రస్తుతం అధికారులు నివేదికలు పంపారు. ఇందులో గ్రామంలోని కొందరు వ్యక్తులు గడ్డలు వేసుకొని ఉండడంతో ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కమ్యూనిటీ భవనం వద్దకు వెళ్లి ఖాళీ చేయాలని సూచిస్తుండగానే.. టీడీపీ వర్గీయులు బాబు, నాగభూషణ, నాగరాజులు ఖాళీ చేసేది లేదంటూ అడ్డుపడ్డారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిని దుర్భాషలాడుతూ ఘర్షణకు దిగారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులు వెంకటరాముడు, నరేష్, అంజి అక్కడకు చేరుకుని అడ్డుకోగా.. వారిపై దాడికి దిగారు. క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులో మేజర్ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం కేంద్ర బృందం సభ్యులు నాగేంద్ర, బాలగంగిరెడ్డి, అనంత శ్రీనాథ, మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ చెత్తతో సంపద తయారీ కేంద్రాల్లో పొడి, తడి చెత్త వేర్వేరుగా వేస్తున్నారన్నారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం ఎంతో విజయవంతం అవుతుందన్నారు.

ప్రజలు కుడా పంచాయతీ వారికి సహకరిస్తూ ఇంట్లోని చెత్తను వారికి అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుంటలో శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహం ప్రత్యక్షం



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: స్థానిక గంగమ్మ గుడిలో మాయమైన శ్రీకృష్ణుని పంచలోహ విగ్రహం బుధవారం మండల కేంద్రంలోని కుంట వద్ద ప్రత్యక్షమైంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గంగమ్మ గుడిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయంలో భద్రపర్చిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు రహస్యంగా ఉంచారు. దీనిపై శ్రీకృష్ణుడి విగ్రహం మాయం శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. అయితే బుధవారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని కుంటలో గల 1వ రోడ్డులో విగ్రహం దొరికింది. ఎస్ఐ విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన రమాదేవి(38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కడుపు నొప్పి తాళలేక ఆమె ఈ నెల 1న ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. తీవ్రంగా కాలిన గాయాలైన ఈమెను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో బుధవారం మృతి చెందింది.

మృతురాలికి భర్త గోపాలకృష్ణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

- త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్

అనంతపురంశ్రీకంఠంసర్కిల్: త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ ధరణీ కిశోర్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో అల్లరి మూకలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. తాజాగా త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దారు గంజాయి విక్రేతలను గుర్తించి వారిపై కూడా రౌడీషీట్లు తెరిచినట్లు పేర్కొన్నారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు లేకుండా ఉక్కుపాదం మోపినట్లు వెల్లడించారు. పలుచోట్ల దాడి చేసి, పేకాట స్థావరాలను గుర్తించామన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 94906 18679 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

దేవదాయ శాఖకు రూ.2 లక్షల ఆదాయం

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం నుంచి దేవదాయ శాఖకు రూ.2 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గూగూడు కుళ్లాయిస్వామికి ఉత్సవాల అనంతరం పోగైన చెక్కరను ఈ నెల 4న ఆలయ ప్రాంగణంలో వేలం వేయగా కేజీ రూ.34తో పలువురు కొనుగోలు చేశారన్నారు. మొత్తం 6,189 కేజీలకు గాను రూ.2,10,426 ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు.

గోశాలకు ఆవుల తరలింపు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి అశోక్‌నగర్ ప్రాంతంలో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు యత్నించారు. ఈ క్రమంలో అశోక్‌నగర్‌కు చెందిన ఆవుల యజమాని విజయేంద్ర అడ్డుకునే ప్రయత్నం చేశాడు. నగర ప్రజలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గిస్తున్న ఆవులను గోశాలకు తరలిస్తుంటే అడ్డుకోవడం సరికాదని కార్యదర్శి సంగం శ్రీనివాసులు హితవు పలికారు. కానీ విజయేంద్ర అధికారుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు వన్‌టౌన్ పీఎస్‌లో అతడిపై ఫిర్యాదు చేశారు. ఆవులను ఎక్కడపడితే అక్కడ వదలకూడదని ఆవుల యజమానులకు విజ్ఞప్తి చేశారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: గోకులాష్టమి పండగను పురస్కరించుకొని గురువారం శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరసింహులు యాదవ్, లక్ష్మీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఉమ్రా యాత్ర దైవ కార్యం



ఉమ్రాకు వెళ్తున్న యాత్రికులను సన్మానిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: ఉమ్రా అనేది హజ్ తర్వాత అత్యంత ప్రాముఖ్యత కల్గిన దైవ కార్యమని నగర మేయర్ వసీం సలీం అన్నారు. బుధవారం రాత్రి స్థానిక చాందినీ మసీదులో ఉమ్రా వెళ్తున్న యాత్రికులకు సత్కారం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇటీవల అనేక మంది హజ్ యాత్ర ముగించుకువచ్చారన్నారు. ఇప్పుడు ఉమ్రా యాత్రకు వెళ్తుండటం ఆనందకరమన్నారు. యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం యాత్రికులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు మసీదులో సామూహిక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లాబేగ్, జిల్లా కార్యదర్శి రహంతుల్లా, కార్పొరేటర్లు ఇసాక్ మౌలానా, హరూన్ రషీద్, ముతవల్లి రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో 11 కేవీ విద్యుత్ స్తంభాల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆదర్శనగర్, ఓబులదేవనగర్, నాయక్‌నగర్, కృపానంద నగర్, విద్యుత్ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతల ప్రజలు గమనించాలని కోరారు.

తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి



ఓటరు జాబితాపై విచారణ చేస్తున్న ఏపీడీ అనురాధ

కూడేరు: తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి , ఏపీడీ అనురాధ బీఎల్‌ఓలను ఆదేశించారు. బుధవారం వారు కూడేరు, కడదరకుంట, కమ్మూరులో ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉన్న వారితో మాట్లాడారు. ఇంతక ముందు బీఎల్‌ఓలు మీ ఇంటి వద్దకు వచ్చారా, మీకు డబుల్ ఓటు ఉందని తెలిపారా అని ఆరా తీశారు. వారి అంగీకారంతో ఒక చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా రీసర్వేపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, రీసర్వే సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, ప్రసన్నకుమార్, విజయ కుమార్, ఏపీఓ తులసీప్రసాద్ , రవి, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: ఇగుదూరు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సెబ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఎర్రగుడి బాస్కర్, మేడికుర్తి విశ్వనాథ్, ఆదినారాయణ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.